

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఆకాష్, ప్రముఖ న్యాయవాది ముక్త సురేష్, కౌన్సిలర్ చిలువేరు వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన శ్రీరాములు వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, తద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటుకు మార్గం సుగమమైందని కొనియాడారు. వాసవి క్లబ్ అధ్యక్షులు మరియాల ఉదయ్ బాబు మాట్లాడుతూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సెక్రటరీ బాల శ్రీనివాస్, కోశాధికారి కలకుంట్ల శ్రీధర్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాల్లో సెల్ సిగ్నల్ కష్టాలు తీర్చండి

**ప్రత్యేక కార్యదర్శికి ఆత్రం సక్కు వినతి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో నెలకొన్న సెల్ సిగ్నల్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సోమవారం బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర సమాచార, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిర్యాణి మండలంలోని పంగడి మాదార, మంగి, గోపెర గ్రామాల్లో సెల్ టవర్ల నిర్మాణం పూర్తి అయి చాలా రోజులైనా ఇంకా కనెక్షన్లు ఇవ్వలేదని ఆయన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గాదిగూడ, నార్నూర్, జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, కేరమేరి, వాంకిడి ఆసిఫాబాద్ మండలాల్లోని అనేక గ్రామాలకు నేటికీ సెల్ సిగ్నల్స్ లేని కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ముఖ్యంగా నెట్‌వర్క్ లేకపోవడం వల్ల పింఛన్ దారులు బయోమెట్రిక్ వేయడానికి, అత్యవసర సేవలు పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిర్యాణి మండలంలోని పంగడి మాదార, గోపెరా, మంగి గ్రామాల సెల్ టవర్లకు త్వరితగతిన కనెక్షన్ ఇప్పించాలని, సిగ్నల్ లేని మిగిలిన గ్రామాలకు కూడా నెట్‌వర్క్ సౌకర్యం కల్పించాలని ఆయన వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే వినతిపై సానుకూలంగా స్పందించిన ప్రత్యేక కార్యదర్శి , సంబంధిత అధికారులతో మాట్లాడి నెల రోజులలోపు ఆయా గ్రామాల్లో కనెక్షన్స్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

# హోటళ్లపై పోలీసుల తనిఖీ

**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా ఎస్పీ నితిక పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా వ్యాపార సంస్థలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారా అనే విషయాన్ని పోలీసులు పరిశీలించారు. ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో న్యూ శ్రీ కృష్ణా హోటల్‌లో రెండు, రంకా హోటల్‌లో ఒకటి చొప్పున గృహ వినియోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన సదరు హోటల్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆసిఫాబాద్ సిఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. సబ్సిడీపై వచ్చే గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వ్యాపార సంస్థలు లాభాపేక్షతో పాటు వినియోగదారుల భద్రతా నియమాలను కూడా తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.






# భవనంపై నుండి పడి ఒకరికి తీవ్ర గాయాలు

**మానవత్వం చాటిన మున్సిపల్ వైస్ చైర్మన్**

**స్వయంగా ఆసుపత్రికి తరలించిన ఎండీ అహ్మద్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలో ప్రమాదవశాత్తు భవనంపై నుండి పడి గాయపడిన ఓ వ్యక్తిని ఆసి ఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ సకాలంలో స్పందించి ప్రాణదాతగా నిలిచారు. జిల్లా కేంద్రంలోని బజార్ వాడీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న ప్రకాష్ జాదవ్ ఆదివారం రాత్రి తన నివాసం ఉంటున్న భవనం రెండో అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయనకు శరీర భాగాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో వెళ్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, స్థానికులను చూసి వెంటనే తన వాహనాన్ని ఆపారు. రక్తపు మడుగులో గాయాలతో ఉన్న ప్రకాష్ జాదవ్‌ను గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తన సొంత వాహనంలోనే ప్రకాష్ జాదవ్ ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి, బాధితుడి భార్య లక్ష్మీ జాదవ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రకాష్ జాదవ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆయన కోరారు. ఒక ప్రజా ప్రతినిధి హోదాలో ఉండి కూడా సామాన్యుడి ప్రాణాలు కాపాడేందుకు తక్షణమే స్పందించి, స్వయంగా ఆసుపత్రికి తరలించిన ఎండీ అహ్మద్ తీరును ఆసిఫాబాద్ పట్టణ ప్రజలు, పోలీసులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఆయన చూపిన మానవత్వంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.





# ఇఫ్తార్ విందు ఇవ్వడం పుణ్యకార్యం

**బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరరావు**

**31 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం**

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ టౌన్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బిజెపి సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. “ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షలు చేపడతారు. అటువంటి పవిత్రమైన సమయంలో నా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడాన్ని నేను మహా పుణ్యకార్యంగా భావిస్తున్నాను. గత 31 సంవత్సరాల నుండి ఈ సంప్రదాయాన్ని నేను కొనసాగిస్తున్నాను. కులమతాలకు అతీతంగా అందరం కలిసి మెలిసి ఉ ండాలన్నదే నా ఆకాంక్ష” అని పేర్కొన్నారు. తన పిలుపును మన్నించి ఇఫ్తార్ విందుకు ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, 9వ వార్డు కౌన్సిలర్ సాలం బిన్ అహ్మద్, మాజీ సింగిల్ విండో ఛైర్మెన్ అలీ బీన్ అహ్మద్‌తో పాటు మైనారిటీ నాయకులు మీర్ సబిర్ హష్మీ, సయ్యద్ ఆన్సర్, సయ్యద్ నిసార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, సమద్‌లను అరిగెల నాగేశ్వరరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పెంటయ్య, సింగల్ విండో మాజీ వైస్ చైర్మన్ ప్రలాద్, బిజెపి నాయకులు సంతోష్, శ్రీకాంత్, శ్రీశైలం, నాయకులు మషిర్, అమర్ బీన్ అహ్మద్, నజీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సమగ్ర అభివృద్ధియే లక్ష్యం

**ఉద్యమ కెరటం, వాంకిడి :** మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని సర్పంచ్ చూనార్కర్ సతీష్ అన్నారు. వాంకిడి మండలంలోని జెడ్పీఎస్ఎస్ ఎస్సీ కాలనీలో సుమారు నాలుగు లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో బురద రోడ్ల వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రాధాన్యత క్రమంలో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో కాంట్రాక్టర్లు కచ్చితంగా నాణ్యత పాటించాలని, అధికారులు కూడా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన కోరారు. గ్రామంలోని అన్ని వీధుల్లో డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం కల్పించి, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీపక్ ముండే, పంచాయతీ కార్యదర్శి శివ, వార్డు సభ్యులు జ్యోతి, బండే శంకర్, మొహర్కర్ అశోక్, ఉప్రే విజయ్, దుర్గం శ్యామ్ రావ్, జాడే రోషన్ , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** జాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని డోంగర్‌గావ్ గ్రామంలో పారిశుధ్య కార్మికులను ఆ గ్రామ సర్పంచ్ అబ్దుల్ రహమాన్ సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వారు నిత్యం అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. గ్రామ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమం కోసం కార్యక్రమాలు



**ఉద్యమ కెరటం, భీంపూర్:** కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని సర్పంచ్ కమలాబాయి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా భీంపూర్ మండలం గోన్ గ్రామంలో సోమవారం పారిశుధ్య కార్మికులను సన్మానించి పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. అలాగే పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వంలో కార్మికులకు నిజమైన గౌరవం దక్కుతోందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముశ్రాన్ అహ్మద్, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వీర హనుమాన్ శోభయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** ప్రతియేట లాగే ఈసారి కూడా శ్రీ వీర హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శోభయాత్రను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని హిందూ జాగరణ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కాగజ్‌నగర్‌లోని హనుమాన్ ఆలయంలో శోభయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం హిందూ జాగరణ్ నాయకులు మాట్లాడుతూ శ్రీ వీర హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ శోభయాత్రకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ రాజేశ్వర్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని సూచించారు.

అర్జీల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని, శాఖల వారీగా వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఈ వారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పింఛన్లు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పనులు, భూభారతి తదితర సమస్యలపై ప్రజల నుంచి ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మొత్తం 85 వినతులు అందినట్లు పేర్కొన్నారు. ఆయా అర్జీలను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఏఓ వర్ణతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ రక్షణకు ఆర్ఎస్ఎస్ దోహదం

- సత్తుపల్లిలో ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:**

జాతి నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన ధ్యేయమని ఆ సంఘ రాష్ట్ర బాధ్యులు అప్పాల ప్రసాద్ తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో "జాతి సేవలో వందేళ్లు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం జిల్లా సంఘచాలక్ లక్కినేని ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ మతం పేరుతో విధ్వంసం జరగకుండా దేశాభివృద్ధికి దోహదపడటమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సంస్థగా ఆర్ఎస్ఎస్ నిలిచిందని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో ఏర్పడిన ఈ సంస్థ కార్యకర్తలలో క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం, ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని తెలిపారు. భరతభూమి విశ్వగురువుగా నిలవడానికి ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని అన్నారు. లక్కినేని ప్రసాద్ మాట్లాడుతూ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఐదు ఆదర్శ నియమాలను కార్యకర్తలకు బోధిస్తుందని చెప్పారు. హక్కులతో పాటు బాధ్యతలను గుర్తుంచుకోవడం, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండడం, స్వీయ క్రమశిక్షణ పాటించడం, అన్ని కులాలను ఆదరించడం, మంచిని స్వీకరించడం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం వంటి విలువలను పాటించాలని సూచించారు.





సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హత్య కేసు

- ఇది షాకింగ్ మర్డర్ కేసు..!
- నాన్నను అమ్మ చంపేసిందని కూతురు బయటపెట్టిన రహస్యం
- ప్రియుడి సహాయంతో భర్తను హతమర్చిన వైనం
- సహజ మరణంగా చిత్రీకరించిన భార్య



**ఉద్యమ కెరటం, భద్రాద్రి కొత్తగూడెం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో సెంట్రింగ్ కూలీగా పనిచేస్తున్న ఎస్‌డీ. జాఫర్‌ను అతని స్వస్థలం చింతలపూడిలోనే భార్య ఖతిజా హత్య చేసింది. 13 ఏళ్ల క్రితం ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన ఖతిజాను వివాహం చేసుకున్న జాఫర్, పదేళ్లు తిప్పనపల్లిలో నివసించి గత మూడేళ్లుగా చింతలపూడిలో ఉన్నాడు. వీరి కుమారుడు హాస్టల్‌లో చదువుతున్నాడు. ఎనిమిదేళ్ల కూతురు తల్లిదండ్రులతోనే ఉండేది. చింతలపూడి వాసి మీరాతో ఖతిజాకు వివాహేతర సంబంధం ఏర్పడటంతో దంపతుల మధ్య గొడవలు తీవ్రమయ్యాయి. ఆరు నెలల క్రితం తిప్పనపల్లికి తిరిగి వచ్చినప్పటికీ, ఖతిజా మీరాతో రహస్యంగా మాట్లాడుతూ ఉండటం జాఫర్‌కు తెలిసి, గత పది రోజులుగా ఆమెతో తీవ్ర గొడవలు జరిగాయి. అక్రమ సంబంధానికి అడ్డుకట్టిన భర్తను హత్య చేసింది. తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైనా తొలగించాలని నిర్ణయించుకున్న ఖతిజా ప్రియుడి సహాయంతో జాఫర్ నిద్రపోతున్నప్పుడు మొహంపై దిండు పెట్టి హత్య చేసింది. "మద్యం సేవించి కింద పడి గాయపడ్డాడు, తెల్లవారుజామున చనిపోయాడు" అని అందరినీ నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేయించింది. అంత్యక్రియల తర్వాత కూతురితో మాట్లాడుతుండగా, నాన్నను అమ్మ, ఇంకో వ్యక్తి కలిసి చంపేశారు అంటూ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ఈ సమాచారంతో కుటుంబ సభ్యులు ఖతిజాను చితకబాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చింతలపూడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆధారాలు సేకరించి ఖతిజాను అరెస్టు చేశారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్

**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** మండలంలోని పట్వారిగూడ గ్రామంలో ఆదివారం పెందూర్ కుటుంబానికి చెందిన వివాహ వేడుకల్లో ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంరం సత్యవతి కోటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుదేవ్ నగర్ బాబేర్ సంస్థ పీఠాధిపతి గురువు ఆత్రం పురుషోత్తం మహారాజ్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కోడప నగేష్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్క బాపూరావ్, పెందూర్ తులిరాం, సిడం గంగారాం తదితరులు పాల్గొన్నారు.



# మంచినీటి పైపులైన్ సమస్యకు పరిష్కారం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని 11వ వార్డు పరిధిలో ఉన్న వెంగళరావు నగర్ రోడ్ నం.1లో చెట్ల వేర్లు పెరిగి మంచినీటి పైపులైన్ జామ్ కావడంతో పలువురు ప్రాంతాలకు మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ మీర్జా జాన్ మొహమ్మద్ తక్షణమే స్పందించారు. మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి వెంటనే జేసీబీని అక్కడికి పంపించారు. పైపులైన్ వద్ద పెరిగిన చెట్ల వేర్లను తొలగించి, దెబ్బతిన్న భాగాన్ని మరమ్మతులు చేయించడంతో సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. దీంతో పలువురు రోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఊరట లభించింది. సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించిన కౌన్సిలర్ మీర్జా జాన్ మొహమ్మద్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపే నాయకులు అరుదుగా ఉంటారని స్థానికులు ఆయనను ప్రశంసించారు.

# ఆపదలో అండగా ఎమ్మెల్యే రాగమయి

**ఉద్యమ కెరటం, పెనుబల్లి:**

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి చేయూత అందించారు. పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామానికి చెందిన రసపుత్ర నాగేశ్వరరావు, ఆయన కుమారుడు రసపుత్ర మధుల ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతై కుటుంబం సర్వస్వం కోల్పోయింది. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి, స్టీల్ వస్తువులు వంటి అవసరమైన సామాగ్రిని అందజేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని చెప్పి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో చీకటి రామారావు, చీకటి చిన్న నరసింహారావు, బొర్రా కోటేశ్వరరావు, భుక్క కృష్ణవేణి, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మల్లెల రాజా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

**• జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం సాత్నాల మండలంలోని సైద్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే మేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ స్టేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, రిమ్స్ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరాల్లో అందిస్తున్న సేవలపై కలెక్టర్ రోగులు, వైద్యుల ద్వారా అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. స్పెషలిస్ట్ డాక్టర్లు, కంటి వైద్యులు, ఆర్థోపెడిక్ నిపుణులు, జనరల్ ఫిజీషియన్లు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సూచించిన మేరకు చికిత్సలు, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన రోగులను మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తామని తెలిపారు. గర్భిణీలు తప్పనిసరిగా ఐదవ నెలలో టిఫా స్కాన్ చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మే 20న జిల్లా స్థాయిలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో దాదాపు 5వేల నుంచి 7వేల వరకు ఉద్యోగ అవకాశాలు ఉండనున్నాయని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రారంభంలో వేతనాలు తక్కువగా ఉన్నప్పటికీ కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మేడిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉమ–మహేష్ దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై ఇంటిని ప్రారంభించారు. మండలంలో మంజూరైన 33 ఇళ్లలో ఇప్పటికే 23 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసుకునేలా చూడాలని సూచించారు. రాబోయే ఐదేళ్లలో ఇళ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరవుతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, తహశీల్దార్ రామారావు, ఇంచార్జి ఎంపీడీఓ గంగాధర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు శివప్రసాద్, స్థానిక సర్పంచ్ లక్ష్మీ, వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజనుడు కురిసెంగ అర్జున్ హత్య



**ఉద్యమ కెరటం, జైనూర్:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పవర్‌గూడ పంచాయతీ పరిధిలోని కాలేజీగూడ (రాంనగర్)లో పవర్‌గూడకు చెందిన గిరిజనుడు కురిసెంగ అర్జున్ (40) హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్జున్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వంట కట్టెలు అమ్ముకుంటూ జీవించేవాడని, ప్రతిరోజూ రాత్రి కాలేజీగూడకు వచ్చి నాటు సారా తాగేవాడని తెలిపారు.

ఆదివారం రాత్రి కాలేజీగూడలో ఓ వ్యక్తి నూతనంగా నిర్మి స్తున్న ఇంటి వద్ద అర్జున్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు సమాచారం. సోమవారం ఉదయం కాలనీవాసులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో జైనూర్ సీఐ రమేష్ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అర్జున్ తలపై బండరాళ్లతో కొట్టి హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సంఘటన స్థలాన్ని పవర్‌గూడ సర్పంచ్ తొడసం రాజేందర్‌తో పాటు పలువురు గ్రామస్తులు సందర్శించి పరిశీలించారు. అర్జున్‌ను ఎవరు, ఏ కారణంతో హత్య చేశారనే అంశంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కూలి పని చేసుకునే అర్జున్‌ను ఎందుకు హత్య చేశారన్న కోణంలో కూడా విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# అనుమానాస్పదంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురానికి చెందిన చింతకాయల శ్వేత (17) ముదిగొండ మండలం వల్లభి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈనెల 9న ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ నుంచి ఫోన్ రావడంతో అదేరోజు ఆమె తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఈనెల 12, 14 తేదీలలో ఖమ్మంలోని ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు శ్వేతను ప్రశ్నించగా, హాస్టల్‌లో ఆయా మందలించడంతో ఈనెల 7న ఐరన్, పారాసిటమాల్ మాత్రలు తీసుకున్నానని తెలిపినట్లు సమాచారం. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి శ్వేత మృతిచెందింది. తమ కుమార్తె మృతికి హాస్టల్ ఆయా మందలించడమే కారణమని శ్వేత తల్లి ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ మురళి తెలిపారు.

# మెగా వైద్య శిబిరానికి విశేషా స్పందన



**ఉద్యమ కెరటం, కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేషా స్పందన లభించింది. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ మద్దతుతో చెన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నల్లజాల కిషోర్ వైద్యులు, రోగుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దవాఖాన వైద్యురాలు మాట్లాడుతూ ఈ మెగా హెల్త్ క్యాంపుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 187 మంది రోగులు హాజరయ్యారని తెలిపారు. అందులో 54 మంది రోగుల నుంచి రక్త పరీక్షల నమూనాలు సేకరించగా, మిగతా వారికి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నల్లజాల కిషోర్, వార్డు సభ్యులు బర్రె సర్వేశ్వరరావు, నలజాల వెంకటకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుమర్తి మోహన్ రావు, మాదల గోపాలరావు, వంశీ కృష్ణ, నలజాల మంగపతి, కెవిఆర్ (కొడవటి వెంకటేశ్వరరావు), శ్రీరామ్ యాదవ్, వల్లెబోయిన నాగరాజు, సంగెపు రామారావు, ప్రభుత్వ వైద్యులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ కార్మికులకు సన్మానం

**ఉద్యమ కెరటం,బజార్హత్నూర్:** మండలంలోని మోర్ఖండి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్టీ పర్పస్ కార్మికులను సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ తొడాసం నాందేవ్ మల్టీ పర్పస్ కార్మికులు దౌలత్, నగేష్, భూమన్నలకు శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్థాయి కార్మికుల సేవలను గుర్తించి సన్మానించే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన ఎంతో గొప్పదని అన్నారు. గ్రామాభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం ఉప సర్పంచ్ కానిందే సుదర్శన్ మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో తమ గ్రామానికి పన్నెండు ఇళ్లు మంజూరు కావడం శుభపరిణామమని, త్వరలో మరిన్ని ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆనంద్ రావు, జగన్, రాజేందర్, నర్సింలు, గంగాధర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



# పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని తలండి గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొత్తం 174 ఆవులు, గేదెలకు టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి ఎస్. సాగర్ తెలిపారు. పశువులకు ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా ఆలస్యం చేయకుండా సమీప పశువైద్యశాలను వెంటనే సంప్రదించాలని పశు పోషకులకు సూచించారు. పశువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న టీకాల కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తలండి గ్రామ పంచాయతీ సర్పంచ్ నైతం మెంగు, పశువైద్య శాఖ సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు కీలకం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని తిర్యాణి గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ చెని కుమార్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తిర్యాణి గ్రామపంచాయతీ కార్యాలయంలో కారోబారి సుద్దాల తిరుపతితో పాటు పారిశుధ్య కార్మికులను గ్రామపంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో రోగాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. వారు నిరంతరం శ్రమిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారని అన్నారు. వారి సేవలను గ్రామపంచాయతీ తరఫున అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలు



**ఉద్యమ కెరటం, తలమడుగు:** తలమడుగు మండలంలోని బరంపూర్, రుయ్యాడి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారులు అలాలి లక్ష్మి, పోతారాజు లక్ష్మి తదితరుల ఆహ్వానం మేరకు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతను కూడా ప్రారంభించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలకు గృహ సౌకర్యం కల్పించే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బరంపూర్ సర్పంచ్ మెస్రం దేవురావ్, రుయ్యాడి సర్పంచ్ ఉదుగు రాకేష్, పల్లి (బి) సర్పంచ్ కె. సంజీవ్, సెక్రటరీ అనిల్ రెడ్డి, ఉప సర్పంచ్‌లు రంజిత్ రెడ్డి, కె.వెంకటేష్, వార్డు సభ్యులు జే. ఉత్తమ్, ఎన్. అశోక్, ఎస్. రమాకాంత్, నాయకులు కె. ప్రతాప్, ఎన్. గంగాధర్, కె. విట్టల్, ఎల్. ప్రవీణ్ రెడ్డి, టీ. గంగారెడ్డి, నర్సయ్య, మోహన్, బాపూరావ్ తదితరులు పాల్గొన్నారు.

# పూరి గుడిసెలు పోయి పక్క ఇల్లు



**ఉద్యమ కెరటం, భీంసరి:** ఆదిలాబాద్ నియోజకవర్గంలోని భీంసరి మండల కేంద్రంలో ఆ గ్రామ మాజి ఎంపిటిసి బిక్కి గంగాధర్ ఇందిరమ్మ గృహాల నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పూరి గుడిసెలు పోయి నిరుపేదలకు పక్క ఇల్లు అందడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొనియాడారు. పోతారాజు శోభ అశోక్ దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి హాజరై, వారిని సత్కరించి అంబేద్కర్ చిత్ర పటాన్ని బహుకరించారు. నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు అందడంలో ఆదిలాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కంది శ్రీనివాస్ కృషి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగార్తు, అంబాదాస్ లు పాల్గొన్నారు.

# ఘనంగా శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడి హెట్టీ గ్రామంలో ఆరే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.02 గంటల నుంచి 1.15 గంటల వరకు భవిష్యత్ నక్షత్ర యుక్త శుభ ముహూర్తంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సంఘం జిల్లా అధ్యక్షుడు భట్టుపల్లి జయరాం హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఆరే సంక్షేమ సంఘం గ్రామ స్థాయి నాయకులు, సభ్యులు పూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కౌటాల మండల అధ్యక్షుడు నాగపురే బండు పటేల్ పాల్గొని విగ్రహ ఆవిష్కరణకు సహకరించారు. సంఘం ముఖ్య నాయకులు, ప్రముఖులు ఈ మహోత్సవంలో పాల్గొని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ స్వరాజ్య స్ఫూర్తి, ధైర్యం, నాయకత్వ గుణాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.

# సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా దుర్గం మహేందర్



**ఉద్యమ కెరటం, తాండూర్:** కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా దుర్గం మహేందర్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంచిర్యాల జిల్లా తాండూర్ మండలానికి చెందిన దుర్గం మహేందర్‌ను మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నే సతీష్, రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీ వినయ్ పవన్ మహేందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాండూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా వేదికగా తనవంతు కృషి చేస్తానని మహేందర్ తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి, కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలకు చేరువలో ఉచిత వైద్య సేవలు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తుందని గ్రామ సర్పంచ్ ఆడే శీల అన్నారు. సోమవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా వైద్య శిబిరాన్ని ఏరాపటు చేశారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో వచ్చిన ప్రజలకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాధన, స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్యామ్‌లను సన్మానించారు. అలాగే సేవలందించిన గైనకాలజిస్టులు కార్తీక్, ఇందుజా, వినీత్ రెడ్డి, ఆనంద్, దీపక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇంతియాజ్, ఉప సర్పంచ్ నిఖిల్, పంచాయతీ కార్యదర్శి రాందాస్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతుకానికి రెండు పశువులు బలీ



**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్(యూ) మండలంలోని పుల్లారా గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం విద్యుత్ ఘాతానికి రెండు పశువులు మృతి చెందినట్లు పుల్లారా సర్పంచ్ వెడ్మ జంగు భాయి దత్త తెలిపారు. గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఆత్రం సోనే రావు, ఆత్రం చందన్ షాలకు చెందిన ఒక ఎద్దు, ఒక ఆవు మేతకు వెళ్లిన సమయంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉండటంతో అవి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఇప్పటికే పంటలు సరిగా పండక రైతులు అప్పుల పాలై ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో విద్యుత్ ప్రమాదంతో వేలాది రూపాయల విలువైన పశువులను కోల్పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం విద్యుత్ శాఖ, ఐటిడిఏ ద్వారా తగిన న్యాయం చేసి ఆర్థిక సహాయం అందించాలని అధికారులను కోరారు.

# దేశ భారత చరిత్రలో ముదిరాజ్ వంశానికి విశిష్ట స్థానం

- **పరిశోధకుడు సోనబోయిన సతీష్ ముదిరాజ్**



**ఉద్యమ కెరటం, తిరుపతి జిల్లా:** భారత దేశ చరిత్రలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో ముదిరాజ్ వంశానికి విశిష్టమైన స్థానం ఉందని ముదిరాజ్ చరిత్ర పరిశోధకుడు సోనబోయిన సతీష్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ వంశ చరిత్ర, సంస్కృతి, భాషా సాహిత్య అంశాలపై విస్తృత పరిశోధనలు చేస్తున్న ఆయన సోమవారం తిరుపతి జిల్లా పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం సంతవేలూరు గ్రామంలో స్థానిక ముదిరాజ్ సంఘ నాయకులు, సామాజిక వర్గాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోని అనేక ప్రాంతాల్లో ముదిరాజ్ వంశానికి సంబంధించిన కోటలు, ఆలయాలు, శాసనాలు, జానపద సంప్రదాయాలు చారిత్రక ఆధారాలుగా ఉన్నాయని తెలిపారు. కొన్ని గ్రామాల్లో గ్రామ దేవతల పూజారులుగా ముదిరాజులు కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఆధారాలను సేకరించి శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రపంచానికి పరిచయం చేయడం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా పీహెచ్‌డీ పరిశోధన కొనసాగిస్తున్నట్లు వివరించారు. ముదిరాజ్ చరిత్ర అధ్యయనంలో భాగంగా ఇప్పటికే తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటిస్తూ తిరుపతి జిల్లా పరిసర ప్రాంతాల్లోని పలు చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా వెంకటగిరి దుర్గం, ముదిరాజ్ పాళెం కోట, వరదయ్యపాళెం మండలం సంత వేలూరులోని పుట్టాలమ్మ గుడి, తొండమనాడు, శ్రీకాళహస్తి ప్రాంతాలు, ముతిరాసిపాళెంలోని గుర్రప్పస్వామి ఆలయాలను పరిశీలించినట్లు అన్నారు. శైవ సంప్రదాయంలో ప్రముఖ స్థానం కలిగిన మహాభక్తుడు కన్నప్ప నాయనార్ గురించి ప్రస్తావించారు. చారిత్రక భక్తి గ్రంథాల ప్రకారం కన్నప్ప నాయనార్ ముత్తరైయర్ వంశానికి చెందినవారని తెలిపారు. ఆయన అసలు పేరు తిన్నడు కాగా, అడవి వేటగాడిగా జీవించి తర్వాత శ్రీకాళహస్తి శివలింగానికి పరమభక్తుడిగా ప్రసిద్ధి చెందినట్లు చెప్పారు. శైవ సంప్రదాయంలో 63 నాయనార్లలో ఆయన ఒకరని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ముదిరాజ్ పెద్దలు, యువత ఆయనను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాయాని యువకిశోర్, పూజారి పురు షోత్తం, పోతనబోయిన నాగరాజు, కాకి హరన్, మన్నేటి విజయ్ ధనరాజ్, పులుసు హరీష్, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చికెన్ చిన్న, శంకరయ్య, తులసి, దయ, జగన్ తదితర ముదిరాజ్ సంఘం నాయకులు, పాల్గొన్నారు.

# హామీలను వెంటనే అమలు చేయాలి




**ఉద్యమ కెరటం, తాండూర్:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తాండూర్ మండల బీజేపీ అధ్యక్షుడు భరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్ తహశీ ల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి తహశీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ వాటిలో చాలా వరకు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటించడం, నిరుద్యోగ భృతి అందించడం, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు పెంచడం, కళ్యాణ లక్ష్మి, పేదల గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు ఇంకా అమలులోకి రాలేదని తెలిపారు. మండలంలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందక పోవడంతో పెట్టుబడుల కోసం అప్పులపై ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు చేసిన ఆసరా పెన్షన్ దరఖా స్తులను వెంటనే ఆమోదించి అర్హు లందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మండలానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఈ సంవత్సరం నుంచే ప్రారంభించడంతో పాటు బుధవారం సంతలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృ ష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్ధం మల్లేష్, సీనియర్ నాయకులు పుల్లం తిరుపతి, చీలువేరు శేషగిరి, కోమండ్ల శ్రీనివాస్, ఎస్. శీతల్, సిహెచ్. నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- **కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై అర్జీదారులు దరఖాస్తులు సమర్పించారు. ఎంసీసీ ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ యూనియన్ ప్రతినిధులు గత 10 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరగా, బెల్లంపల్లి 17వ వార్డు షంషేర్ నగర్ కు చెందిన లక్ష్మణరావు తమ ప్రాంతంలోని ప్రభుత్వ వాటర్ ట్యాంక్ కూల్చివేతపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన కోట లక్ష్మి తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు కల్పించాలని, కొత్తూరు గ్రామ రైతులు గత సీజన్ లో విక్రయించిన సన్న రకం వడ్లకు బోనస్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహద్ హుస్సేన్ భూమి పట్టా సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే రెబ్బెనపల్లి మత్స్య సహకార సంఘ సభ్యులు సంఘ ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేయాలని, సర్వాయిపేట గ్రామానికి చెందిన ఆలం మల్లేష్ భూమిని వారసుల పేరిట మార్చాలని, జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన దుర్గమ్మ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యాబోధన చేయాలి

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో ఉన్న ఆదర్శ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బాలికల వసతి గృహంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వాటిని వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం హాజీపూర్ మండలం చందనాపూర్‌లోని పట్టణ ఆవాస పాఠశాలను సందర్శించి పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాల వంటశాలను సందర్శించి విద్యార్థుల ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పనుల పురోగతిపై అధికారులు నిఘా పెట్టాలి

- **అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. సోమవారం భీమారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. దాంపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తాగునీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట భీమారం తహశీల్దార్, ఎంపీడీఓ, మండల పంచాయతీ అధికారి, సంబంధిత శాఖల అధికారులు

